క్లుప్తంగా

చెట్ల పెంపకంపై అవగాహన ర్యాలీ



చిప్పాడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తగరపువలస: చెట్ల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించింది. చెట్ల పెంపకం వలన కలిగే ప్రయోజనాలు, ప్లాస్టిక్ వలన అనర్థాలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై విద్యార్థులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, 16 మందికి బహుమతులు అందించారు. అనంతరం వారితో 250 మొక్కలు నాటించారు. కార్యక్రమంలో భీమిలి ఎంఈవో శివరాణి, స్కూల్ కమిటీ చైర్మన్ శంకర్‌రెడ్డి, దివీస్ సిబ్బంది డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 'అవంతి' విద్యార్థి ప్రతిభ



తులసీరావును అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

తగరపువలస: ఇటీవల విజయనగరం జిల్లా రాజాం జీఎంఆర్ఐటీలో జరిగిన అంతర కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో చెరకుపల్లి అవంతి కళాశాల మెకానికల్ విభాగం ఫైనలియర్ విద్యార్థి ఎ.తులసీరావుకు రెండో స్థానం లభించింది. 110 కిలోల విభాగంలో పతకం సాధించిన విద్యార్థిని ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ కోల చంద్రశేఖర్ తదితరులు గురువారం అభినందించారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న పద్మజ

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పద్మజ అనే మహిళ గురువారం మొక్కలు పంపిణీ చేశారు. వాటిలో ఇంట్లో పెంచుకోదగిన గులాబీ, చామంతి, మల్లె, మనీప్లాంట్ తదితర మొక్కలు ఉన్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శామ్యూల్‌రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లి హైస్కూల్లో పాము కలకలం



పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నాగుపాము ప్రవేశించడంతో విద్యార్థులు భయకంపితులయ్యారు. ఉదయం 11 గంటల సమయంలో విద్యార్థులు బాత్ రూమ్‌కు వెళుతున్న సమయంలో, నాగజెర్రి బాత్ రూమ్‌లోకి ప్రవేశించింది. దాన్ని చూసిన విద్యార్థులు పరుగులు తీశారు. స్నేక్ క్యాచర్ వచ్చి, పామును పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రాథమిక పాఠశాలలో చోరీ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ ప్రాథమిక పాఠశాలలో దొంగలు పడి గ్యాస్ సిలిండర్, స్పోర్ట్స్ మెటీరియల్ ఎత్తుకుపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆదివారం రాత్రి పాఠశాల గ్రిల్స్ తెరచి లోపలికి ప్రవేశించిన దొంగలు వీటిని ఎత్తుకుపోయారు. సోమవారం ప్రధానోపాధ్యాయుడు రాము పాఠశాలకు వచ్చి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి భీమిలి పోలీసులకు, ఎంఈవో కార్యాలయంలోను ఫిర్యాదు చేశారు.

పర్యాటక ధామం పద్మనాభం

ఆకట్టుకుంటున్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలు

పద్మనాభం: ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతాలతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది పద్మనాభం. కార్తీక వన సమారాధనలు నిర్వహించుకునేందుకు ఇక్కడి ప్రాంతాలు అనువుగా ఉండటంతో పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు.

ప్రత్యేకం.. పద్మనాభస్వామి ఆలయం

యావద్భారత దేశంలో అనంత పద్మనాభ స్వామి ఆలయాలు రెండు చోట్ల మాత్రమే ఉన్నాయి. ఒకటి కేరళ రాష్ట్రం తిరువనంతరపురంలో ఉండగా.. రెండోది పద్మనాభంలో గిరిపై ఉంది. గిరిపైకి వాహనాలపై వెళ్లడానికి రోడ్డు సౌకర్యం ఉంది. గిరిపై పునర్నిర్మాణంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని తిలకించవచ్చు. గిరిపై నుంచి కిందకు చూస్తే వంపు సొంపుల గోస్తని నది, పచ్చదనం పరుచుకున్నట్టు ఉన్న ప్రకృతి అందాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. అనంత పద్మనాభ స్వామి గిరి ప్రథమ పావంచా వద్ద ఉన్న నారాయణేశ్వర ఆలయ సన్నిధిలో కొలువుదీరిన 12 అడుగుల శివుని విగ్రహం పర్యాటకుల మనసు దోచుకుంటుంది.

కుంతీదేవి ప్రతిష్ఠించిన మాధవుడు

అనంత పద్మనాభ స్వామి ఆలయానికి అనుబంధంగా దిగువన కుంతీ మాధవ స్వామి ఆలయం ఉంది. కుంతీ దేవి తీర్థయాత్రల్లో భాగంగా దేశంలో ఐదు చోట్ల మాధవ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించిందని చెబుతారు. దీనిలో ఒకటి పద్మనాభంలో ఉండటం విశేషం. కుంతీ దేవి మాధవ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించినందున అనంత పద్మనాభ స్వామికి గిరి దిగువన అనుబంధంగా ఉన్న ఆలయానికి కుంతీ మాధవ స్వామి ఆలయమని పేరొచ్చింది.



పద్మనాభంలో అనంతుని గిరి ప్రథమ పావంచా వద్ద శివుడి విగ్రహం, కుంతీదేవి ప్రతిష్ఠించిన కుంతీ మాధవ స్వామి విగ్రహం



గిరిపై నుంచి దర్శనమిచ్చే ప్రకృతి సోయగం



పొట్నూరులో శ్రీకృష్ణ దేవరాయల విజయ స్థూపం



పాండ్రంగిలో అల్లూరి జనన గృహం

విజయరామరాజు స్మారక వేదిక

సిపాయిల తిరుగుబాటుకు ముందుగానే స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడిన ధీరుడు విజయనగర సంస్థానాధీశుడు పూసపాటి రెండో చిన విజయ రామరాజు. 1794 జూలై 10న గోస్తని నది తీరంలో ఉన్న పద్మనాభంలో జరిగిన పద్మనాభం యుద్ధంలో వీరమరణం పొందారు. విజయరామ రాజును వీరమరణం పొందిన యుద్ధ స్థలంలోనే సమాధి చేశారు. ఆయన జ్ఞాపకార్థం నిర్మించిన సామాజిక వేదిక, సమాధి చూడొచ్చు.

అల్లూరి జన్మస్థానం

దేశ స్వాతంత్ర్యం కోసం తెల్ల దొరలపై సాయుధ పోరాటం చేసిన అగ్గి పిడుగు అల్లూరి సీతారామ రాజుకు జన్మనిచ్చిన పుణ్యగడ్డ పాండ్రంగి, పద్మనాభం మండలంలో ఉంది. ఈ గ్రామంలో అల్లూరి విగ్రహాన్ని, జనన గృహాన్ని, సామాజిక వేదికను తిలకించవచ్చు.

శ్రీకృష్ణదేవరాయల స్థూపం

శ్రీకృష్ణ దేవ రాయలు దక్షిణ దేశ దండయాత్రలో భాగంగా తన విజయానికి సూచికగా నిర్మించిన సర్వ రాజుల శిల్ప సమ్మేళనంతో కూడిన స్థూపాన్ని పొట్నూరులో చూడొచ్చు. మండల కేంద్రానికి విశాఖ, సింహాచలం నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి.

ప్రకృతి వ్యవసాయం చేసేవారికి ప్రోత్సాహం

కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మన్యం రైతులు సేకరించిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

తగరపువలస: ప్రకృతి వ్యవసాయం చేసే వారికి ప్రోత్సాహం అందించి, వారి సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. ఆనందపురం మండలం తర్లువాడ ఎస్సీ కాలనీలో మన్యం రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని గురువారం ఆయన సందర్శించారు. వారు సేకరించిన పండ్లు, కూరగాయలు తదితర ఉత్పత్తులను పరిశీలించారు. సేకరణ దగ్గర నుంచి మార్కెటింగ్ వరకు వివరాలను నిర్వాహకురాలు బిందును అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలో మహిళా రైతులు, ప్రకృతి రైతు సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, ఎంపీడీవో వి.జానకి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.సత్యనారాయణరెడ్డి, డీపీఎం మోహనరావు, ఉద్యానవనశాఖ డీడీ మన్మథరావు, అధికారి స్వాతి, ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త కొంగర రమేష్, మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే 25 నుంచి సమ్మె

పద్మనాభం: 108 సిబ్బంది సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించకుంటే నవంబర్ 25వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏపీ బంగార్రాజు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 108 సిబ్బంది పది రోజులుగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థలను తరచూ మార్చడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. వైద్య కళాశాలలో చేపడుతున్న ఈఎంటీ పోస్టుల్లో 108 సర్వీస్ ఈఎంటీలను నియమించాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీలోగా జీతాలు చెల్లించాలని, 8 గంటల షిఫ్ట్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో 108 సిబ్బంది మధు, తిరుపతి, పైడిబాబు, రామునాయుడు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

తీర ప్రాంత ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

భీమునిపట్నం: భీమిలితో పాటు విశాఖ వరకు ఉన్న తీరప్రాంతంలో ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని మత్స్యకార నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మత్స్యకారుల కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు మాట్లాడుతూ సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా బీచ్‌లోని అనేక ప్రాంతాల్లో మత్స్యకారులకు ఇబ్బంది కలిగేవిధంగా అనేక నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. కానీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో కొత్త నిర్మాణాలు వస్తూనే ఉన్నాయన్నారు. ఇవన్నీ చూస్తుంటే అధికారులు వారితో కుమ్మక్కయ్యారనే అనుమానాలు వస్తున్నాయని అన్నారు. మరణించిన మత్స్యకారులను తీరంలో ఖననం చేయడం తరతరాలుగా వస్తున్న తమ ఆచారమని, ఇందుకోసం ప్రత్యేకించి స్థలం కేటాయించినట్లు తెలిపారు. కానీ, ఆ స్థలాన్ని ప్రైవేట్ రిసార్ట్ వారు ఆక్రమించి, పార్టీలు నిర్వహిస్తున్నారని, ఇది దారుణమని పేర్కొన్నారు. తమకు ఎంతో పవిత్రమైన స్థలంలో అలా చేయడం సరికాదని, అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జోనల్ కార్యాలయం వద్దకు వెళ్లి, జెడ్సీ ప్రేమ ప్రసన్న వాణికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు గంటా నూకరాజు, పేర్ల విజయచందర్, పీసీ అప్పారావు, చెన్నాదాసు, కారి అప్పారావు, అల్లిపిల్లి నర్సింగరావు, మైలిపల్లి షణ్ముఖరావు, చురకల రమణ, నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మత్స్యకారులు

పుస్తక పఠనంతో విజ్ఞానం

తగరపువలస: సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా, పుస్తక పఠనంతోనే తరగని విజ్ఞానం సొంతమవుతుందని చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ అన్నారు. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి గురువారం ఆయన పూలమాల వేసి, వారోత్సవాలను ప్రారంభించారు. తమ విద్యార్థుల సౌకర్యార్థం 40వేల పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

• ఆనందపురం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ వారోత్సవాలను సర్పంచ్ చందక లక్ష్మి ప్రారంభించారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బీవీఎస్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు కొట్యాడ రమాదేవి, బంటుపల్లి రమణమ్మ, కొలుసు ఎర్రమ్మ, చందక సూరిబాబు పాల్గొన్నారు.



అవంతిలో గ్రంథాలయ పితామహుడు రంగనాథన్‌కు నివాళులు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: బాలల దినోత్సవం సందర్భంగా శిల్పారామం (జాతర) లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరంలోని సిద్ధేంద్ర యోగి నాట్యాలయంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు, కూచిపూడి నృత్యంతో ఆకట్టుకున్నారు. శ్రీరంగని కల్యాణం నృత్యాంశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాన్ని స్థానిక పరిపాలనాధికారి టి. విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

అవంతిలో ముగిసిన వర్క్‌షాప్

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన నాలుగు రోజుల వర్క్‌షాప్, 24 గంటల హ్యాక్‌థన్ గురువారం ముగిశాయి. బ్రెన్ ఓ విజన్ సహకారంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్ షాప్‌నకు రిసోర్స్ పర్సన్‌గా వి.సాయిపవన్, ఓబుల్, కన్వీనర్‌గా శ్రీలక్ష్మి వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా రథాల ఉత్సవం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో బంగారమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ బళ్లను రథాలుగా తీర్చిదిద్ది, గ్రామంలో మూడు సార్లు ఊరేగించారు. రాత్రి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.



రథాలను ఊరేగిస్తున్న దృశ్యం

బాలల చేతుల్లోనే దేశ భవిత

- చిల్డ్రన్స్ డే వేడుకల్లో వక్తలు
- ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు
- వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు



గంభీరం ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం

తగరపువలస: నేటి బాలలకు మంచి భవిష్యత్తు ఇవ్వగలిగితే, వారే రేపటి తరంలో దేశనిర్మాణానికి తోడ్పడతారని ఆనందపురం మండలం గంభీరం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు.వి.వి. ప్రసాద్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు.

• ఆనందపురం ప్రాథమిక పాఠశాల, జెడ్పీ హైస్కూళ్లలో జై జవాన్ ఫౌండేషన్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించింది. ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పట్నాయక్, అంజనీకుమారి పాల్గొన్నారు.

• బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఫ్యాషన్ షో నిర్వహించి, బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• చిప్పాడ జెడ్పీ హైస్కూల్లో జరిగిన వేడుకలలో ఎంఈవో శివరాణి, ప్రధానోపాధ్యాయిని ఎంపీటీ రత్నం విద్యార్థులకు బహుమతులు అందించారు.

• రామన్నపేట సాయి రవీంద్ర, ఇన్‌క్రెడిబుల్ ప్లే స్కూల్‌లో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ వేడుకలు నిర్వహించి, ఫుడ్ ఫెస్టివల్ చేపట్టారు. చిట్టివలస శ్రీరామకృష్ణ విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ మానాపురం శివసాయి శ్రీనివాసరావు, డొప్ప పార్వతి ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు.

ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో..

భీమునిపట్నం: ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ వద్ద జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి పిల్లలతో కలిసి మొక్కలను నాటారు. భీమిలి సమీపంలోని సన్‌స్కూల్ వద్ద పాఠశాల అధ్యక్షురాలు కైతపల్లి లక్ష్మి లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

• కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద ప్రిన్సిపాల్ గంగ కుమారి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

అంధుల ఆశ్రమ పాఠశాలలో..

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని అంధుల ఆశ్రమ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయిని ఎస్.కె. నూర్జహాన్ పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

• **పద్మనాభం:** మండలంలోని రౌతులపాలెం, సంగుపేట, సామయ్యవలస, కృష్ణాపురం కాలనీ ప్రాథమిక, పొట్నూరు ప్రాథమికోన్నత, పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పనోరమా హిల్స్‌లో ..

మధురవాడ: ఎండాడ శ్రీరామ్ పనోరమ హిల్స్ సెలబ్రిటీ టవర్స్‌లో గురువారం చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు ఆటలు, పాటలు, క్విజ్, రైమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బ్లాక్ టు సెలబ్రిటీ టవర్స్ అధ్యక్షుడు ఆనంద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ రొక్కం రావు, వివిధ స్కూళ్ల ప్రిన్సిపాళ్ల చేతులు మీదుగా బహుమతులు అందించారు.



బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో..



ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో మొక్కలు నాటుతున్న జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి, చిన్నారులు



ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు



రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో..



అంధుల ఆశ్రమ పాఠశాలలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, సిబ్బంది



రౌతులపాలెం పాఠశాలలో నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

రీ సర్వేకు 45 దరఖాస్తులు

పద్మనాభం: రీ సర్వేలో తప్పుల సవరణ కోసం మండలంలోని పెంటలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో 45మంది దరఖాస్తు చేసుకున్నారు. పేర్లు సరి చేయాలని 27 మంది, విస్తీర్ణం సరి చేయాలని 11 మంది, కొర్లేషన్ కోసం ఒకరు, ఇతర భూ సమస్యలు పరిష్కరించాలని ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. రీ సర్వే డీటీ వరలక్ష్మి ఈ దరఖాస్తులు తీసుకున్నారు.

నిధుల్లేక నిలిచిన ఆలయ నిర్మాణం

పద్మనాభం: కృష్ణాపురంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ సన్నిధిలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణం నిధుల్లేక నిలిచిపోయిందని ఆలయ కమిటీ ప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.ఉపేంద్ర తెలిపారు. ఆలయాన్ని కొంతవరకు నిర్మించామని, మిగిలినది పూర్తి చేసేందుకు దాతలు సహకరించాలని కోరారు. వివరాలకు 99496 30359, 98496 70559 నంబర్లకు ఫోన్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులకు చేయూత

మధురవాడ: పీఎన్‌టీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పోతిన నగేష్ గురువారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎండాడ దివ్యాంగుల పాఠశాల, ఆరోగ్య బాలల సంరక్షణ కేంద్రం, మధురవాడ ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద గల వైజాగ్ ఓల్డేజ్ హోమ్‌లో ఉన్నవారికి భోజనం ఏర్పాట్లు చేశారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, పంచారు. పోతిన హాసిని పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులకు శిక్షణ

తగరపువలస: ఆనందపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీకి ఎంపీడీవో వి.జానకి ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా వచ్చే ఏడాదికి నిధుల సమీకరణ, ప్రణాళికపై ఈ శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై ధరాభారం

మధురవాడ: ప్రజలు ఎదుర్కొంటున్న కనీస సమస్యలు పరిష్కరించలేక పోతున్న కూటమి ప్రభుత్వం అన్ని వస్తువుల ధరలను మాత్రం విపరీతంగా పెంచేస్తోందని సీపీఎం విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.6 వేలు కోట్లు పెంచిందని, వచ్చే ఏడాది మరో రూ.11వేలు కోట్లు కరెంటు చార్జీలు వసూలు చేయడానికి ఏపీఈఆర్‌సీకి పంపిందని చెప్పారు. నిత్యావసర వస్తువులు ధరలు కూడా విపరీతంగా పెంచేస్తున్నారని, కానీ.. కార్మికుల జీతభత్యాలు మాత్రం పెంచడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. మహిళలు, చిన్నారులపై రోజురోజుకూ దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయన్నారు. జనవాసాల మధ్య మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారన్నారు. ఇటువంటి వాటిపై ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జోనల్ ఆఫీసు నుంచి కొమ్మాది జంక్షన్, రైతు బజార్, కరెంటు ఆఫీసు మధురవాడ అప్ బ్రిడ్జి, హైస్కూల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ, బి.భారతి, కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ హైవే సర్వీసు రోడ్డులో ర్యాలీ చేస్తున్న సీపీఎం శ్రేణులు

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

భీమునిపట్నం: పెరిగిన నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ తమకు అధికారం ఇస్తే ధరలను తగ్గిస్తామని, విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందని, దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించాలని, హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అప్పలనాయుడు, రవ్వ నర్సింగరావు, భాగం లక్ష్మి, రమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

బావిలో దూకి యువతి ఆత్మహత్య

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని బావిలో దూకి గురువారం రాత్రి ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలివి.. మధురవాడ రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన దూడ హర్షిత (16) ఒక యువకుడిని ప్రేమించగా, వివాహానికి ఇంట్లో అంగీకరించలేదు. దీంతో ఈమె గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కాగా ఇప్పుడు మూడోసారి భీమిలికి వచ్చి రాత్రి పది గంటల ప్రాంతంలో బోయివీధి సమీపంలోని బొమ్మల నుయ్యిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టంకు తరలించారు. ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా, ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



హర్షిత మృతదేహం